సాక్షి విశాఖపట్నం

శనివారం, 16 సెప్టెంబర్, 2023



బ్రైట్‌స్టార్‌లో ఐఎన్‌ఎస్ సుమేధ


సింథియా: ఈజిప్టులోని పోర్ట్ అలెగ్జాండ్రియాలో జరిగిన బ్రైట్‌స్టార్ 2023 సైనిక వ్యాయామంలో భారత నౌకాదళానికి చెందిన నౌక ఐఎన్‌ఎస్ సుమేధ పాల్గొంది.



వైద్య రంగంలో చారిత్రక ఘట్టం

రాష్ట్రంలో ఒకే రోజు ఐదు మెడికల్ కాలేజీలను సీఎం జగన్‌ప్రారంభించడం చారిత్రక ఘట్టమని వైద్య విద్యార్థులు అన్నారు. IIలో

18 నుంచి వినాయగర్ నవరాత్రి మహోత్సవాలు



ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. IIలో

వైజాగ్‌లో ‘దాల్ లేక్’!

- బోటులో తిరుగుతూ షాపింగ్
- ముడసర్లోవలో ఏర్పాటుకు అధ్యయనం
- శ్రీనగర్ టూర్‌లో పరిశీలించిన మేయర్ బృందం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ముడసర్లోవ రిజర్వాయర్‌లో బోటులో విహరిస్తూ కంబాలకొండ అందాలను తనివితీరా చూస్తూ కాఫీ తాగాలని ఉందా? అక్కడే నచ్చిన వాటిని కొనుగోలు చేసి ప్రకృతిని ఆస్వాదించాలని ఉందా? అచ్చంగా శ్రీనగర్‌లోని దాల్ లేక్ తరహాలో... ఇక్కడ పర్యాటకులను ఆకర్షించేందుకు...నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సమాయత్తమవుతోంది. తాజాగా జీవీఎంసీ అధ్యయన యాత్రలో భాగంగా శ్రీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ పర్యటనలో ‘దాల్ లేక్’ను పరిశీలించారు. పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పంచేందుకు వీలుగా దాల్ లేక్‌ను అభివృద్ధి చేశారు. బోటులో షికారు చేస్తూ... ఫ్యామిలీతో కలిసి అక్కడే భోజనం చేయడం, షాపింగ్ చేసేందుకు వీలుగా దీనిని అభివృద్ధి చేశారు.



ఇదీ దాల్ లేక్...

జమ్మూ, కశ్మీర్‌లో ఇది రెండో అతిపెద్ద సరస్సు. దీనిని ఫ్లవర్ లేక్, శ్రీనగర్ జ్యువెల్ అని కూడా పిలుస్తారు. 5 అడుగుల నుంచి 20 అడుగుల లోతుతో 18 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ లేక్‌లో బోటింగ్‌తో పాటు అక్కడ సేద తీరేందుకు రూమ్స్, భోజనం చేసేందుకు హోటల్స్ మాత్రమే కాకుండా షాపింగ్ చేసేందుకు షాపులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ హోటల్స్, షాప్స్ కూడా బోట్ల మీదనే ఏర్పాటు చేయడంతో పాటు లేక్‌లోనే ఉండటం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఒక వైపు మంచుకొండలు.. మరోవైపు సరస్సు అందాలను చూస్తూ బోటింగ్ చేయడం పర్యాటకులను కట్టిపడేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చి బోటింగ్ చేసి సేదతీరడాన్ని అమితంగా ఆస్వాదిస్తున్నారు. ఇదేతరహాలో ఇక్కడ ముడసర్లోవను అభివృద్ధి చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం జీవీఎంసీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

అదేతరహాలో ఇక్కడ ముడసర్లోవను అభివృద్ధి చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులతో సమీక్షించారు. దీనిపై అధ్యయనం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ప్రధానంగా నగర వాసులతో పాటు విశాఖకు విచ్చేసే పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

ముడసర్లోవలో....!

వాస్తవానికి గతంలో జీ–20 సమావేశాల సందర్భంగా వచ్చిన ప్రపంచదేశాల అతిథుల బృందం ముడసర్లోవలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంటు (ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్)ను పరిశీలించారు. ఇప్పటికే ముడసర్లోవ వివిధ రకాలుగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ రిజర్వాయర్ మొత్తం 62 ఎకరాల్లో విస్తరించి ఉంది. నగర ప్రజలకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు నిరంతరం ప్రయత్నించడంలో భాగంగా దాల్ లేక్ తరహాలో ముడసర్లోవ లేక్‌ను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ మేయర్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఇంజినీర్స్ డే సందర్భంగా అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రిజర్వాయర్ ఎంత లోతులో ఉన్నది? బోటింగ్ సమయంలో పర్యాటకులకు ఇబ్బంది లేకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలి? ఎక్కడెక్కడ సేదతీరేందుకు షాపింగ్, హోటల్స్ వంటి సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది? అనే అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని సూచించారు.



ముడసర్లోవ పార్కు

అధ్యయనం చేయాలని ఆదేశించాం



శ్రీనగర్‌లో కార్పొరేటర్లతో కలిసి పర్యటించాం. అక్కడ నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను గమనించాం. అక్కడ 4 జోనల్ కార్యాలయాలు ఉన్నాయి. మనతో పోలిస్తే చిన్న ప్రాంతం. అయినప్పటికీ అక్కడ దాల్ లేక్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశారు. అదేతరహాలో ఇక్కడ ముడసర్లోవలో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని భావిస్తున్నాం. ఇదే విషయంపై అధ్యయనం చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించాం. ఇప్పటికే నగరవాసులకు సౌకర్యాలను కల్పించడంలో జీవీఎంసీ ముందంజలో ఉంది. బస్ బేలు, రోడ్ల వెడల్పు, జంక్షన్ల అభివృద్ధి, వైఎస్సార్ వ్యూ పాయింట్ ఏర్పాటు, బీచ్ క్లీనింగ్ యంత్రాలతో ఎప్పటికప్పుడు బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచడం వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం. ముడసర్లోవ రిజర్వాయర్‌ను దాల్ లేక్ తరహాలో అభివృద్ధిపై అధ్యయనం చేసిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ముందుకు వెళతాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో ఇన్‌చార్జి మంత్రి రజిని

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సీఎం హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారంపూడికి బయలుదేరి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతంతో వీడ్కోలు పలికిన వారిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, గొడ్డేటి మాధవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా కలెక్టర్ డా ఎ. మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లే అనురాధ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఉన్నారు. ముఖ్యమంత్రి 2.28 గంటలకు విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో సమాచార కమిషనర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఐలాపురం రాజా

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలోని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని సూపరింటిండెంట్ త్రిమూర్తులు అందజేశారు. దేవస్థానం ఈఈ రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఒంటరిగానే వైఎస్సార్ సీపీ పోటీ

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసొచ్చినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తుందని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పవన్ కల్యాణ్‌ను మీపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరానని.. ఇప్పుడు ఆ సవాల్‌కు సిద్ధంగా ఉన్నారా అంటూ విలేకరులు ఆయన్ని ప్రశ్నించారు. అందుకు తానెప్పుడూ సిద్ధమేనని ఎంపీ సమాధానమిచ్చారు. అవసరమైతే చంద్రబాబు తనపై తూర్పులో పోటీ చేసి గెలవాలన్నారు. జనసేన, టీడీపీలు తొలి నుంచి పొత్తులోనే ఉన్నాయన్నారు. చదువు, సంక్షేమం, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలే వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయన్నారు. అభివృద్ధిలో విశాఖ దూసుకుపోతుందన్న ఆయన స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు చేసిన స్కాంను కేంద్ర సంస్థలే వెలుగులోకి తెచ్చాయన్నారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా సన్యాసిరావు



జేసీ విశ్వనాథన్ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా 69వ వార్డుకు చెందిన బోగాది సన్యాసిరావు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎస్.విశ్వనాథన్, డీఎస్‌ఓజీ సూర్యప్రకాష్‌లు బోగాదికి నియామక పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం బోగాది సన్యాసిరావు 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడుగా, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ వ్యవహరిస్తున్నారు.

రేపు బాధ్యతలు స్వీకరించనున్న సింహాచలం ఈవో



శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ ఎస్. శ్రీనివాసమూర్తిని నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్. కరికల్ వలవెన్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఇప్పటివరకు విశాఖ డీఆర్‌ఓగా పనిచేసిన శ్రీనివాసమూర్తిని సింహాచలం దేవస్థానం ఈవోగా నియమిస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఈనెల 5న ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూశాఖకి చెందిన శ్రీనివాసమూర్తి ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

21న విమ్స్‌లో వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. 43 మంది సూపర్ స్పెషలిస్టులు, జనరల్ స్పెషలిస్టుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సూపర్ స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ 1.60లక్షలు, జనరల్ స్పెషలిస్టు వైద్యులకు రూ. 92 వేలు వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఏపీ మెడకల్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలు కోసం dme.ap.nic.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



డీఆర్‌వో మోహన్ కుమార్‌కు మట్టి వినాయక ప్రతిమను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఈ నెల 18వ తేదిన వినాయక చవితిని పురస్కరించుకొని ప్రజలందరూ పర్యావరణ హితమైన మట్టివినాయక ప్రతిమలను వినియోగించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మట్టివినాయక ప్రతిమలను కలెక్టర్, జేసీ విశ్వనాథన్ పంపిణీ చేశారు. 6వేల మట్టి వినాయక ప్రతిమలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఎంవీపీ రైతు బజార్, జిల్లా పరిషత్ జంక్షన్, సెంట్రల్ పార్కు జీవీఎంసీ కార్యాలయం, అక్కయ్యపాలెం రైతు బజారు వద్ద ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మోహన్ కుమార్, పీసీ బోర్డు ఈఈ నాగిరెడ్డి, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం



కథక్ నాట్య గురువులు నళిని, కమిలినిలకు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న రాజా

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వైశాఖీ నృత్యోత్సవం శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వైభవంగా ప్రారంభమైయింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఆదాయ పన్నుల మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఐలాపురం రాజా, అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఆదాయ పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శంకర్ పాండీ, కేంద్ర పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.మహ్మద్ ఆలీ, వీవీ రమణమూర్తిలు పాల్గొన్నారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన కథక్ నాట్య నిపుణులు పద్మశ్రీ అవార్డు గ్రహీత నళిని, కమిలీని సోదరీమణుల ద్వయానికి వైశాఖీ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అనంతర పురస్కార గ్రహీతలైన నళిని, కమిలీలను ద్వయం కథక్ నాట్య విన్యాసం ప్రేక్షకులను మైమరపించింది. విశాఖకు చెందిన సూదగాని గీతా నారాయణ్ కె.శోభానాయుడు నృత్య పరికల్పన చేసిన కూచిపూడి సంప్రదాయ నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్ అద్వితీయం నృత్యంలో అందరిని అలరించింది. దుబాయికి చెందిన శ్రావణి తెన్నేటి కూచిపూడి నృత్యాంశాన్ని అద్భుతంగా ప్రదర్శించి అందరి హృదయాలను దోచుకున్నారు. కేరళకు చెందిన శ్రీ ముద్ర కళా గురుకులం కళా బృందం చిత్రా సుకుమారన్ పర్యవేక్షణలో మోహినీ యాట్టం ప్రదర్శించారు.



నాట్యం చేస్తున్న కళాకారులు

సాంకేతిక ప్రగతితో అవకాశాలు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: సాంకేతిక ప్రగతి నూతన అవకాశాలను సృష్టించే మార్గాలను చూపుతోందని ఏయూ ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఇంజినీర్స్ డే ని పురస్కరించుకొని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన యాక్సిస్ 2కే23 సింపోజియాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ అవకాశాల తలుపులు తెరుచుకుంటున్నాయని వీటిని అందుకోవాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందన్నారు. సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపేది ఇంజనీర్లేనని,నేటి సమాజంలో ప్రతి అంశం ఇంజనీరింగ్ తో ముడిపడి ఉందనే వాస్తవాన్ని మనందరం గమనించాలని సూచించారు. భవిష్యత్తును ప్రభావితం చేసే విధంగా నేటి తరం పనిచేయాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళిక, సన్నద్ధత చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి కుమార్ రాజా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కుమార్ రాజా , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణరావు కన్వీనర్ ఆచార్య సి.ఎస్‌వి. సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్ పి. సాత్విక,డాక్టర్ కె.రాజశేఖర్, ఆచార్య ఎస్.కె యజ్ఞాని తదితరులు ప్రసంగించారు.

వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో నేడు బీచ్ క్లీనింగ్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7.30గంటలకు స్వచ్ఛతా క్యాంపైన్, క్లీన్‌లినెస్ డ్రైవ్‌లలో భాగంగా బీచ్‌రోడ్డులో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. పామ్‌బీచ్ హోటల్ వద్ద గల ఆల్‌ఎబిలిటీస్ పార్క్ వద్ద ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాల క్రీడా పోటీలు

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ సారథ్యంలో శనివారం హాకీ పోటీలు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు మూడు జిల్లాలకు చెందిన అండర్ -14, 17 బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించి రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు.

జగనన్న కాలనీల గృహ నిర్మాణ పనులు వేగవంతం

- ప్రతి జిల్లాలోనూ నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచాలి
- జగనన్న కాలనీ లే అవుట్ ముఖద్వార నిర్మాణాలు చేపట్టాలి
- గృహ నిర్మాణ సమీక్షలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జీఎం దివాన్



మాట్లాడుతున్న హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ దివాన్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో యుద్ధప్రాతిపదికన జగనన్న కాలనీల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని స్టేట్ హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ బీఎం దివాన్ అధికారులను ఆదేశించారు. విశాఖలో శుక్రవారం పర్యటించిన ఆయన గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దివాన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయుటకు అవసరమైన సిమెంటు, ఇసుక, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని దివాన్ సూచించారు. లేఅవుట్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేయాలని అన్నారు. ప్రతి జగనన్న లేఔట్ కాలనీలో ముఖ ద్వారం ఆర్చ్‌ని త్వరితగతిన నిర్మించాలన్నారు. డ్రైనేజీ, రోడ్లు, నీటి సదుపాయం మొదలు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. గుత్తేదారులకు ఎలాంటి సమస్యలున్న తెలియజేయాలని, వాటిని పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పెషల్ సెక్రటరీ దివాన్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ ఎస్ఈ భవానీ ప్రసాద్, ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ఇండియన్ లీగ్ 2.0కు తరలిరండి



కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ, మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్ ఈ నెల 17న ఉదయం 6.30 గంటల నుంచి సంయుక్తంగా నిర్వహించనున్న ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ప్రఖ్యాత ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి పాల్గొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రుషికొండ ప్రాంతంలో క్లీనింగ్ డ్రైవ్, సాంస్కృతి కార్యక్రమాలు, కైలాసగిరి ప్రాంతంలో క్లీనింగ్ డ్రైవ్‌తో పాటు మానవహారం, ఆర్కే బీచ్‌లో బీచ్ క్లీనింగ్, సాండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్, ఎకో–వైజాగ్ ఆర్ట్ ఎగ్జిబిషన్, వీఎంఆర్‌డీఏ స్మార్ట్‌సిటీ పార్కులో పారిశుధ్య నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. నగర ప్రజలు ఆయా ప్రాంతాల్లో 17న ఉదయం 6.30 గంటలకు పాల్గోవాలని పిలుపునిచ్చారు.

24 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏడాదంతా స్వామికి జరిగే నిత్య సేవలు, విశేష సేవలు, ప్రముఖ ఉత్సవాల రోజుల్లో వైదికపరంగా ఏమైనా దోషాలు ఉంటే వాటిని నివృత్తి చేసేందుకు పవిత్రోత్సవాలను నిర్వహించడం పరిపాటిగా వస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా 24వ తేదీ రాత్రి 7గంటల తర్వాత మృత్యం గ్రహణం, అంకురార్పణం, హోమాలు, 25వతేదీ ఉదయం విశేష హోమాలు, పారాయణాలు, రాత్రి ఆదివాసములు, పారాయణాలు, 26వ తేదీ రాత్రి పవిత్ర సమర్పణ, 27 ఉదయం విశేషహోమాలు, రాత్రి పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 28 ఉదయ ఏకాంత స్నపనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి వేద పారాయణలు, దివ్య ప్రబంధ సేవాకాలం, తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 24వ తేదీ నుంచి 28వతేదీ వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈనెల 24నుంచి 28వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు ఉంటాయని చెప్పారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్రలో స్వల్ప ప్రమాదం

దాబాగార్డెన్స్: అధ్యయన యాత్రకు వెళ్లిన జీవీఎంసీ కార్పొరేటర్లకు ప్రమాదం తప్పింది. స్వల్ప ప్రమాదం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 10న అధ్యయన యాత్రకు వెళ్లారు. కాగా.. శుక్రవారం వారు ప్రయాణిస్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం 8.30 గంటలకు కాట్రా నుంచి బయలుదేరి 40 కిలోమీటర్లు ప్రయాణించి జమ్ము కూడలి ఫ్లైఓవర్ సమీపానికి చేరుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సు బ్రేకులు ఫెయిల్ అయినట్టు గుర్తించి, చాకచక్యంతో ఫుట్‌పాత్‌ను ఢీకొని నిలిపాడు. ఆ సమయంలో బస్సు నెమ్మదిగా నడపడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వెంటనే బస్సుకు మరమ్మతులు చేపట్టారు. అయితే వేరే బస్సులో కార్పొరేటర్లు వెళ్లారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఉన్నారు. కాట్రా నుంచి 260 కిలోమీటర్ల దూరంలోని అమృత్‌సర్ వెళ్లి గోల్డెన్ టెంపుల్, ఇండో పాక్ వాఘా బోర్డర్, జలియన్‌వాలా బాగ్ ప్రాంతాలు సందర్శించాల్సి ఉండగా.. వాటిని రద్దు చేసుకున్నారు. రాత్రి 9.30 గంటలకు అమృత్‌సర్ చేరుకుని బస చేశారు.

వైద్య రంగంలో చారిత్రక ఘట్టం

మహారాణిపేట: రాష్ట్రంలో ఒకే రోజు ఐదు మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం వైద్య రంగంలో చారిత్రక ఘట్టమని వైద్య విద్యార్థులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయనగరం వైద్య కళాశాలను ప్రత్యక్షంగా.. నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఏఎంసీ ప్రాంగణం నుంచి వైద్య విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సీఎం ప్రసంగాన్ని తిలకించిన అనంతరం మాట్లాడారు. వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో విప్లవాత్మకంగా ఉన్నాయని, వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, డాక్టర్ కృష్ణవేణి, పలు వైద్య విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ మన్మథరావు

న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: మర్రిపాలెంలోని న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో శుక్రవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. కోచ్‌ల్లో పరిశుభ్రత, నిర్వహణ, భద్రత చర్యలపై ఆరా తీశారు. కోచ్ కేర్ సెంటర్‌లోని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రేక్‌తో పాటు మరి కొన్ని రేక్‌లను ఆయన పరిశీలించారు. ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్‌ను బట్టి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు, సిబ్బందికి వివరించారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల నిర్వహణ, అండర్ గేర్ పార్ట్స్, ఇన్‌సెక్ట్ నియంత్రణ అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ కోచ్ డిపో ఆఫీసర్ ప్రవీణ్ భటి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వందేభారత్ రైలు అండర్ గేర్ పార్ట్స్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు


ఆత్రేయపురం పూతరేకుల సంఘానికి భౌగోళిక గుర్తింపు సర్టిఫికెట్ అందజేస్తున్న లా వర్సిటీ వీసీ శ్రీసుధ

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలోని మేధో సంపత్తి హక్కుల కేంద్రం(సీఐపీఆర్) కృషితో ఆత్రేయపురం పూత రేకులకు భౌగోళిక గుర్తింపు లభించిందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య శ్రీసుధ వెల్లడించారు. రాష్ట్రంలోని సుమారు 30 రకాల ఉత్పత్తులను గుర్తించి వాటికి కూడా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని.. ఇందులో భాగంగా మాడుగుల హల్వాకు గుర్తింపు తెచ్చేలా రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్‌మెంట్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. సీఐపీఆర్ ఆధ్వర్యంలో వర్సిటీలో శుక్రవారం ఒక్క రోజు జాతీయ సదస్సు జరిగింది. మేధో సంపత్తి హక్కుల నిపుణుడు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఉన్నత్ పి.పండిట్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ శ్రీసుధ మాట్లాడుతూ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఉత్పత్తులు ఎంతో ప్రసిద్ధి చెందుతాయని.. వాటిని తయారు చేయడంలో ఆ ప్రాంత వాసులు ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంటారన్నారు. ఆ ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆచార్య ఉన్నత్ పి.పండిట్ మాట్లాడుతూ రాష్ట్రంలో 16 రకాల ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు లభించిందని, అందులో తిరుపతి లడ్డూ ఎంతో ప్రత్యేకమైనదన్నారు. భౌగోళిక చట్టం అమల్లోకి వచ్చిన రోజునే ఆత్రేయపురం పూత రేకులకు భౌగోళిక గుర్తింపు సర్టిఫికెట్‌ను ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. పూత రేకుల ఉత్పత్తిదారులు తమ గుర్తింపును కాపాడుకునేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. భౌగోళిక గుర్తింపు సంస్థ ప్రతినిధి సంజయ్ గాంధీ మాట్లాడుతూ ప్రతీ న్యాయ విద్యార్థి కనీసం మూడు నుంచి నాలుగు ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం పూతరేకుల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులకు వీసీ గుర్తింపు సర్టిఫికెట్ అందజేశారు. మాడుగుల హల్వాకి భౌగోళిక గుర్తింపు తీసుకొచ్చేందుకు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ప్రతినిధి మారుతి, ఆత్రేయపురం పూతరేకుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రామరాజు, ప్రసాద రాజు, మోదకొండమ్మ తల్లి మాడుగుల హల్వా తయారీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా పెంచాలి


మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: నగరంలో నేర నియంత్రణకు సీసీ కెమెరాలను మరిన్ని ఏర్పాట్లు చేసి మరింత నిఘా పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, టాస్క్ ఫోర్స్, క్రైం, ట్రాఫిక్ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్రైమ్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా సీసీ కెమెరాలను మరిన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. విశాఖ మీదుగా గంజాయి రవాణాను పూర్తి నియంత్రించాలని, నిరంతరం వాహనాలను తనిఖీ చేయాలన్నారు. పబ్ కల్చర్ ముసుగులో రేవ్‌పార్టీలు జరగకుండా నగరమంతా గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు.

జనసేన తీరుతో విద్యార్థుల ఇక్కట్లు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నేవీ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు జనసేన నేతల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవినీతి కేసులో ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా శుక్రవారం గీతం విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించాలని టీడీపీ, జనసేన నిర్ణయించాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నేవీ పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో ర్యాలీకి అనుమతి లేదని ఆ పార్టీల నేతలకు స్పష్టం చేశారు. టీడీపీ నేతలు తమ నిర్ణయాన్ని విరమించుకుంటే.. జనసేన నేతలు మాత్రం ర్యాలీ చేసేందుకు హడావిడి చేశారు. ఈ క్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పరీక్షలు జరుగుతున్నాయని.. ర్యాలీకి అనుమతి లేదని చెప్పినప్పటికీ సందీప్ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆయన్ని అదుపులోకి తీసుకుని ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా.. రాజకీయాల్లోకి తమని లాగడం సమంజసం కాదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు.


గేటు బయట నిలిచిపోయిన విద్యార్థులు

పవన్‌ది దిగజారుడు రాజకీయం

కొమ్మాది: అవినీతి కేసులో జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును కలసి.. అదే జైలు వద్ద టీడీపీతో కలిసి పని చేస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. ఇన్నేళ్లుగా జనసేన జెండా పట్టుకుని తిరిగిన కార్యకర్తలకు ఏం సమాధానం చెబుతానని ప్రశ్నించారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వారి తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఓ వ్యక్తిని అరెస్ట్ చేస్తే పార్టీ నేతగా పవన్ కల్యాణ్ సానుభూతి తెలపాలి గానీ.. జైలు ప్రాంగణంలోనే రాజకీయాలు చేయడం ఏంటని మండిపడ్డారు. అన్ని వర్గాలకు సమపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొవడం ఎవరితరం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సినిమాల్లో మంచి స్టార్ అని.. రాజకీయాల్లో మాత్రం ప్యాకేజీ స్టార్‌గా మారిపోయారని విమర్శించారు. సమావేశంలో నాయకులు పల్లా దుర్గారావు, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

జర్నలిస్టు అక్రిడిటేషన్ల దరఖాస్తుకు 30వ తేదీ ఆఖరు

మహారాణిపేట: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న పాత్రికేయులు అక్రిడిటేషన్ల కోసం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున కోరారు. ఇప్పటివరకు మూడుసార్లు డీఎంఏసీ కమిటీ సమావేశాలను నిర్వహించి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. చివరిసారిగా కమిటీ సమావేశం నిర్వహించి.. అర్హులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామన్నారు. కావున అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌నకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే ఉప సంచాలకుడు, జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని కలెక్టర్ సూచించారు.

ఘనంగా టీఎస్సార్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సుబ్బరామిరెడ్డి

బీచ్‌రోడ్డు: కేంద్ర మాజీమంత్రి టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు ముందుస్తుగా శుక్రవారం జరిగాయి. సిరిపురంలోని ఆయన నివాసంలో అభిమానులు, మిత్రుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. విశాఖలో ఏటా 17న ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. అయితే ఈ ఏడాది హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశం ఉండటంతో ముందుస్తుగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రజలు తనను లోకసభ అభ్యర్థిగా పోటీ చేయాలని కోరుతున్నారని.. దీనిపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తానన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .

18 నుంచి వినాయగర్ నవరాత్రి మహోత్సవాలు

- రోజుకో అలంకరణలో సంపత్ వినాయకుడు
- ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ వెల్లడి



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. తొమ్మిది రోజుల పాటు సంపత్ వినాయగర్ పలు రకాల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. ఇందుకోసం తమిళనాడు నుంచి పలు రకాల పువ్వులను తీసుకొస్తున్నట్లు వివరించారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలు ఏర్పాట్లు చేశామన్నారు. 18న సంపత్ వినాయగర్ అలంకరణ, 19న శ్రీ సిద్ధి బుద్ధి కల్యాణ గణపతి, 20న శ్రీ స్కంధ గణపతి, 21న శ్రీ లడ్డూ ప్రియా గణపతి, 22న శ్రీ రాజగణపతి, 23న శ్రీవాస్య మహాభారత లిఖిత గణపతి, 24న శ్రీ బాల గణపతి, 25న శ్రీ కమలా గణపతి, 26న శ్రీ వీర గణపతి అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

సాంకేతిక సదస్సుల ద్వారా విజ్ఞాన మార్పిడి

అగనంపూడి: విద్యార్థుల మేధో సంపత్తికి సాంకేతిక సదస్సులు దోహదపడతాయని అభి బస్ సీఈవో సీహెచ్ సుధాకర్‌రెడ్డి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా విస్తా టెక్ ఫెస్ట్ పేరిట జరుగుతున్న జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల అనుభవంతోపాటు ప్రేరణ కలుగుతుందన్నారు. విజ్ఞాన మార్పిడికి, పరిశోధనలకు పదును పెట్టడానికి ఇలాంటి వేదికలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి కల్పించడం సంస్థ ఉద్దేశం కాదని.. పరిశోధకులుగా, సంస్థలు నెలకొల్పే స్థితికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఉత్తమ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన వివిధ కళాశాలల విద్యార్థులను అభినందిస్తూ నగదు పారితోషికం, జ్ఞాపికలు బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతుల సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, కన్వీనర్ బొడే ప్రసాద్, కో-కన్వీనర్ పద్మాకర్, స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


అతిథులను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

టీచర్లకు సకాలంలో వేతనాలు

- యూ-డైస్ కోడ్‌తో కేడర్ స్ట్రెంత్ మ్యాపింగ్
- పొజిషన్ ఐడీల మిస్సింగ్‌పై అధికారుల ఫోకస్
- సాంకేతిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విశాఖ విద్య: ఎండాడ జెడ్పీ హైస్కూల్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేస్తున్న అనుపోజు కిరణ్‌కుమార్‌కు ఆగస్టు వేతనం మంజూరు కాలేదు. ఎండాడ హెచ్‌ఎం డీడీవో లాగిన్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ శాంక్షన్ పోస్టు లేకపోవడంతోనే వేతనం మంజూరుకు బ్రేక్ పడింది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల మ్యాపింగ్ ప్రక్రియలో ఇది వెలుగులోకి వచ్చింది. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి.. ఇక నుంచి సకాలంలో వేతనాలు అందించేలా విద్యాశాఖాధికారులు చేస్తున్న కసరత్తు తుది దశకు చేరింది.

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో జిల్లా విద్యాశాఖ కింద అన్ని కేడర్లు కలుపుకుని 3,756 శాంక్షన్ పోస్టులు ఉండగా.. ఇందులో ప్రస్తుతం 3,450 మంది వరకు పనిచేస్తున్నారు. ఆర్థిక శాఖ పరంగా నిధుల కేటాయింపుల్లో ఇబ్బందులు తొలగించి, వేతనాల మంజూరుకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పలు పాఠశాలలు ఎంఈవోల పరిధిలో ఉండగా, తాజాగా ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలకు వేతనాలు మంజూరు చేసే అధికారం ఇస్తూ విద్యాశాఖాధికారులు డీడీవో కోడ్‌లను కేటాయించారు. ఇక నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే నేరుగా ఉపాధ్యాయులు, తమ పరిధిలోని బోధనేతర సిబ్బందికి వేతన బిల్లుల మంజూరు కోసం ట్రెజరీలకు పంపించనున్నారు.

సాంకేతిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

పాఠశాల యూ-డైస్ కోడ్‌తో అనుసంధానం చేస్తూ.. శాంక్షన్ పోస్టుల స్థిరీకరణ చేపట్టారు. మ్యాపింగ్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక పరమైన సమస్య కారణంగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని 22 వరకు పాఠశాలలు పెందుర్తి మండలం పరిధిలో ఉండిపోయాయి. వీటిలో పనిచేస్తున్న సుమారు 200 మంది ఉపాధ్యాయులకు ఆగస్టు వేతన బిల్లులు మంజూరు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి.. ఆ స్కూళ్లు ఏ మండలాల పరిధిలోకి వస్తాయనేది డీడీవో కోడ్‌ల ఆధారంగా పరిశీలన చేసి, మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో వీరందరికీ ఈ నెల సప్లిమెంటరీ బిల్లుల రూపంలో వేతనాలు మంజూరయ్యే అవకాశం ఉంది.


ఏడీ లక్ష్మణరావుకు సమస్య వివరిస్తున్న టీచర్

పొరపాట్లకు ఆస్కారం లేకుండా..

ఎండాడ జెడ్పీ హైస్కూల్‌లో అన్ని కేడర్లు కలుపుకొని 24 శాంక్షన్ పోస్టులు ఉండగా, ఇందులో స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టు లేదు. 2019 జూలై 30న కిరణ్ కుమార్ ఉద్యోగోన్నతిపై స్కూల్ అసిస్టెంట్‌గా చేరగా.. 2019 నుంచి జూలై 2023 వరకు కూడా డీడీవోగా వ్యవహరిస్తున్న పెందుర్తి ఎంఈవో అతనికి మరోచోట వేతనం మంజూరు చేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌ను అక్కడ పోస్టింగ్ ఇచ్చినప్పటికీ, ఆ విషయాన్ని గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదించినట్లయితే సమస్యకు వెంటనే పరిష్కారం లభించేది. కానీ నాలుగేళ్లు శాంక్షన్ పోస్టు లేని చోట ఓ ఉపాధ్యాయుడిని విధుల్లో పెట్టుకోవడమే కాకుండా.. అతనికి వేరే చోట వేతనం అనధికారంగా వేతనం ఇవ్వడం వల్లనే సమస్య జటిలమైంది. ఇలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈవో ఎల్.చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేసి, కేడర్ స్ట్రెంత్ మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టారు.